


# సిద్దిపేట సంగారెడ్డి మెదక్

ఆదివారం 2 ఆగస్టు 2026 పేజీలు : 8


## ఇంజనీరింగ్ విద్యార్థులను నేరస్తులతో పోల్చడంపై ఆగ్రహం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 1:**
ఇంజనీరింగ్ విద్యార్థులను నేరస్తులతో పోల్చడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలని బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగ యువతపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం నారాయణఖేడ్ పట్టణంలో బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను అవమానించేలా ముఖ్యమంత్రి మాట్లాడడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం, వారి సమస్యలను పరిష్కరించడం బదులుగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ పట్నం మాణిక్, కో-కన్వీనర్ సాయి, జ్ఞానేశ్వర్, సగుణాకర్, మండల ప్రధాన కార్యదర్శులు సచిన్, సాయందర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పవన్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గౌడ దశరథ్, అరవింద్, అశోక్, మహమ్మద్ అబ్బు, విఠల్ సాగర్, మోహన్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం




- 1990 మంది విద్యార్థులకు పట్టాలు..
- ముఖ్య అతిథిగా డైరెక్టర్ రాజమౌళి
- చేనేత కళాకారుడు గజం గోవర్ధన్‌కు గౌరవ డాక్టరేట్
- 17 బంగారు పతకాల ప్రదానం
- కృషి, క్రమశిక్షణ, అభిరుచే విజయానికి మూలమని పట్టభద్రులకు రాజమౌళి సందేశం

## రహదారికి తాత్కాలిక ఉపశమనం

### సర్పంచ్ సునీత మహిపాల్ చొరవతో గుంతల పూడ్చివేత..

### గ్రామస్తులు, వాహనదారులకు ఊరట

**అందోలు, ఆగస్టు01, (ప్రజాజ్యోతి):** వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామంలో ప్రధాన రహదారి భారీ గుంతలతో అస్తవ్యస్తంగా మారి ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తోంది. మోకాలు లోతులో ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షం పడిన ప్రతిసారి గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కనిపించక ప్రమాదాల భయం మరింత పెరిగింది. ఈ సమస్యపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేయగా, గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్ వెంటనే స్పందించారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను పూడ్చేందుకు టిప్పర్‌ల ద్వారా వెట్ మిక్స్ తెప్పించి పనులు చేయించారు. రహదారిపై ఉన్న పెద్ద గుంతలను పూడ్చడంతో వాహనాల రాకపోకలు కొంతవరకు సులభతరమయ్యాయి. స్థానికులు సర్పంచ్ చొరవను అభినందిస్తూ, వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే ఇది తాత్కాలిక పరిష్కారమేనని, సంబంధిత అధికారులు శాశ్వతంగా రహదారిని మరమ్మతులు చేసి బీటీ రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో గ్రామీణ రహదారుల నిర్వహణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.







# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం డిమాండ్

**జహీరాబాద్, ఆగస్టు 01 (ప్రజా జ్యోతి న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనిశ్చితిలో పడింది. రెండు సంవత్సరా లకు పైగా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా అనేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా మానసిక కంగా వేదిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థు లను, కళాశాలలను ఈ సంక్షోభం నుంచి బయట పడేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.7,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఈ పరిస్థితి వల్ల పేద మరియు మధ్యతరగతి విద్యార్థులు ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారు. ఈ విషయంలో న్యాయ స్థానాలు కూడా స్పష్టంగా పేర్కొన్న విషయం గుర్తు చేస్తున్నాం. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల ఒరిజినల్ విద్యా సర్టిఫికెట్లను కళాశాలలు నిలిపివేయడం చట్టబద్ధం కాదని, ఒరిజినల్ సర్టిఫికెట్లు విద్యార్థులకు ఇవ్వాల్సిందే అని పలు సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. విద్యార్థుల



భవిష్యత్తును కాలరాసే హక్కు ఏ విద్యాసంస్థకూ లేదు.ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేసిన కళాశాల లపై తక్షణ చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు అందేలా ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలి. బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉండి వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడం మానుకో వాలని ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి,రాంచంద్రారెడ్డి,లు ఉన్నారు.

## జలీల్ సాబ్‌ను పరామర్శించిన ఎస్గి గ్రామ కాంగ్రెస్ బాధ్యులు



**హైదరాబాద్, ప్రజాజ్యోతి ఆగస్టు 1:** ఎస్గి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు తయ్యాబ్ తండ్రి జలీల్ సాబ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, ఎస్గి గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ బాధ్యులు అబ్దుల్ రహీం శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా జలీల్ సాబ్ ఆరోగ్య పరిస్థితిని, వారికి అందుతున్న వైద్య సేవలను వైద్యులు మరియు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, జలీల్ సాబ్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ఒకరికొకరు అండగా ఉంటారని, తయ్యాబ్ కుటుంబానికి పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

గ్రామంలోకి వచ్చేవారు, వెళ్లేవారు కెమెరాల నిఘాలో ఉండాలి

కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి



**కొండాపూర్ ప్రజా జ్యోతి** గ్రామాల భద్రతను మరింత పటిష్ఠం చేయాలంటే ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి శనివారం ఓ ప్రకట నలో అన్నారు. గ్రామాల్లోకి వచ్చేవారు, వెళ్లేవారు సీసీ కెమెరాల నిఘాలో ఉండేలా చర్యలు తీసుకుంటే నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నేరాలను ముందుగానే అరికట్టవచ్చని తెలిపారు.గ్రామ భద్రత విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సోమేశ్వరి కోరారు.

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ

పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం

నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు

భూముల ధరల సవరణతో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ల ఆదాయం 20% వరకు పెరుగుదల

త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం

**హైదరాబాద్ :** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు

## గ్రామంలో మద్యం అమ్మకాలు జరుగుతే 5000 రూపాయలు జరిమానా...

- స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా తీర్చిదిద్దుతాం
- మద్యం అమ్మకాలపై నోటీసులు జారీ
- పంచాయతీ కార్యదర్శి సంతోష్



**మనోహరాబాద్, ఆగస్టు 01 ( ప్రజా జ్యోతి)** మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో మద్యం నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రామంలో మద్యం నిషేధించడంతో శనివారం పలు దుకాణాలకు నోటీసులు జారీ చేశామని పంచాయతీ కార్యదర్శి సంతోష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ గ్రామంలో యువత తప్పుదోవ పట్టకుండా ఎవరైనా మద్యానికి బానిసలు కాకుండా మద్య నిషేధంతో క్రమశిక్షణ ఏర్పడుతుందని అప్పుడే స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దొచ్చని ఆయన అన్నారు. అందుకే గ్రామ సభ తీర్మానం మేరకు గ్రామంలో మద్యం నిషేధిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం పేర్కొని నోటీసులు జారీ చేయడం అయిందని ఆయన అన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరుగుతే 5000 జరిమాన తప్పదని అయిన అమ్మకాలు జరుగుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. వీరితోపాటు పంచాయతీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

-అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాపై ఉక్కుపాదం.

-సర్వే నెం. 993లో అక్రమ నిర్మాణాల కూల్చివేత..



**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)** ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. తహశీల్దార్ వెంకటేష్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది,ప్రభుత్వ భూమి ని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించారు. ఈ సంద ర్భంగా తహశీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలను సహించబోమన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు. ప్రజలు ప్రభుత్వ భూముల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఆక్రమణలకు పాల్పడకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక చర్యలు కొనసాగిస్తోందని, ఆక్రమణలపై నిరంతర నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎక్కడైనా ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు గుర్తించిన వెంటనే కూల్చివేత చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి

-ట్రైనీ ఐఏఎస్ అధికారిణి ప్రతిభ శేఖర్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 1:** ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ ఐఏఎస్ అధికారిణి ప్రతిభ శేఖర్ అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సద్వినియోగం లక్ష్యంగా జెడ్పీహెచ్ఎస్ ఎల్గోయి పాఠశాలలో శనివారం కుల ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ ఉద్యోగాలు తదితర అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ముందుగానే పొందడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. దేవిసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించడం అభినందనీయమైన చర్య అని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.బి విష్ణు సాగర్, డిప్యూటీ తహశీల్దార్ వి. ఆదర్శ్ కుమార్, గ్రామ సర్పంచ్ శివాజీ రావు పాటిల్, ఉప సర్పంచ్ చె. అంజన్న, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## చింతకుంటలో మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



**అందోల్, ఆగస్టు 1, (ప్రజాజ్యోతి):** చింతకుంట గ్రామానికి చెందిన గుండెగల్ల లచ్చమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి బంగారుగల్ల మల్లయ్య (రిటైర్డ్ ఎస్ఐ) కుమారుడు బంగారుగల్ల రోషన్ కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. లచ్చమ్మ మృతి విషయం తెలుసుకున్న రోషన్ కుమార్, గ్రామ పెద్దల ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని, తన వంతు సహాయంగా నగదును పంపించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లచ్చమ్మ మనుమరాలు శ్యామల, మనుమడు రాజుకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ఇదే విధంగా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపల్లి యాదగిరి, రంగల్ల రమేష్, రంగల్ల రాము, గుడేగల్ల యాదయ్యతో పాటు ఆరో వార్డు పెద్దలు పాల్గొన్నారు. అనంతరం లచ్చమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా వ్యక్తం చేశారు.

## జహీరాబాద్ మండలంలో 96 శాతం ఎస్ఐఆర్‌పూర్తి

పార్టీ శ్రేణులు, అధికారులకు జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి పి.నర్సింహా రెడ్డి కృతజ్ఞతలు



**జహీరాబాద్, ఆగస్టు 01 (ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ మండలంలో 96శాతంఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి. నరసింహారెడ్డి తెలిపారు. జహీరాబాద్ మండల అధ్యక్షుడి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో హెల్ప్ డిస్క్ లు ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన బీఎల్ఓలు, బీఎల్ఏలు సూపర్వైజర్లు, అన్ని గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేకధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా మిగిలి ఉన్న శాతాన్ని కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షురాలు నిర్మలా రెడ్డి,పార్లమెంటు సభ్యులు సురేష్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చంద్రశేఖర్ మరియు రాష్ట్ర పార్టీ నాయకులు ఉజ్వల్ రెడ్డిల ఆదేశాల మేరకు జహీరాబాద్ మండలంలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వ హించినట్లు నరసింహారెడ్డి స్పష్టం చేశారు. అలాగే,ఓట్ల తొలగింపు ప్రక్రియకు సంబంధించి గాంధీభవన్ నుంచి వచ్చిన తాజా మార్గదర్శ కాలను ఆయన ప్రస్తావించారు. ప్రక్రియకు ఇంకా గడువు ఉన్నందున ఓట్ల తొలగింపు డిలీషన్ ఫారాల పై పార్టీ నిర్ణయించిన బీఎల్ఏలు ఇప్పుడే ఎలాంటి సంతకాలు చేయవద్దని ఆయన స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యం.పి.పి రాములు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇమామ్ పటేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,కిసాన్ సెల్ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిలీప్, ఖాసీంపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, యూత్ కాంగ్రెస్ హుగ్గెల్లీ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా అభివృద్ధి చేసిన.. ఉప్పల్ నల్ల చెరువుకు జలకళ

**వర్షాలతో చెరువుకు భారీగా వరద నీరు**

**హైదరాబాద్ :** హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును హైడ్రా పునరుద్ధరిస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా.. తక్కువ మొత్తంలో పారే మురుగు నీరు బైపాస్ చేసిన కాలువలోంచి బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువున ఉన్న ప్రాంతాలు నీట మునగకుండా వరదనీరు నల్లచెరువుకు చేరింది. ఉప్పల్ నల్లచెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలు తొలగించి 70 ఎకరాల వరకు విస్తరించిన విషయం విదితమే. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తోంది

## ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల పరిష్కారానికి తొలి అడుగు

ప్రయాణికుల కోసం బెంచీల ఏర్పాటు

త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం: డిపో మేనేజర్ స్వామి





**రాయికోడ్ ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):** ఇటీవల రాయికోడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకపోవడంపై వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో శనివారం బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు కొత్త బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దశలవారీగా చర్యలు చేపడుతున్నా మని తెలిపారు. ప్రస్తుతం బెంచీల ఏర్పాటు చేశామని,త్వరలో మరుగుదొడ్లు,తాగునీరు,లైటింగ్ నిర్వహణతో పాటు బస్టాండ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.స్థానిక ప్రజలు,ప్రయాణికులు బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తున్నందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.సమస్యలపై స్పందించి వెంటనే చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డిపో మేనేజర్ స్వామి,రాయికోడ్ సర్పంచ్ రాధా తుకారం,ఆర్టీసీ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆచూకీ తెలుపండి



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 1:** మానూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి ఈరన్న (49) గత నాలుగు నెలలుగా కనిపించడం లేదని ఆయన భార్య ఉప్పరి సక్కుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ఎ. కోటేశ్వర్ రావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించి, ఈరన్న ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఉప్పరి ఈరన్న గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా మానూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని లేదా ఎస్సై ఎ. కోటేశ్వర్ రావును 8712656758 నంబర్‌లో సంప్రదించి సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం






**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** విద్యా వైభవానికి ప్రతీకగా నిలిచిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 17వ స్నాతకోత్సవాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించింది. విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు అంకితమైన ఈ వేడుకలో మొత్తం 1,990 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో 1,532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. పరిశోధకులు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ముఖ్య అతిథిగా పాల్గొని పట్టభద్రులకు పట్టాలు అందజేశారు. గీతం చైర్మన్ విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. శ్రీభరత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మహాత్మా గాంధీ విగ్రహానికి, గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**చేనేత సేవలకు గౌరవ డాక్టరేట్**

భారతీయ చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ చేనేత కళాకారుడు గజం గోవర్ధన్ కు గీతం విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డీ.లిట్.) ప్రదానం చేసింది. భారతీయ వస్త్ర వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో, సంప్రదాయ చేనేత కళను సంరక్షించడంలో ఆయన అందించిన సేవలను విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా కొనియాడింది. సభలో ఈ సందర్భంగా హర్షధ్వానాలు మార్మోగాయి.

**మెరిసిన ప్రతిభకు బంగారు పతకాలు**

విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 17 బంగారు పతకాలు అందజేశారు. బీటెక్‌లోని అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన డిగుదాడి ప్రణవ్ రాహుల్ రెండు ప్రతిష్ఠాత్మక బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అలాగే పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన 86 మంది పీహెచ్.డీ. స్కాలర్లకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు.

**ఉత్తమ పరిశోధకుల సత్కారం**

విశ్వవిద్యాలయంలో పరిశోధన రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్ కు చెందిన డాక్టర్ మహ్మద్ అర్షద్ అన్సారీ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జూ చెందిన ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబులకు 'బెస్ట్ రీసెర్చర్ అవార్డు'ను ప్రదానం చేశారు. విద్యా రంగంలో పరిశోధనకు విశ్వవిద్యాలయం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ అవార్డులు మరోసారి చాటిచెప్పాయి.

**"అభిరుచి, అంకితభావమే విజయ రహస్యం"**

స్నాతకులను ఉద్దేశించి ప్రసంగించిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, జీవితంలో విజయం సాధించాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదని, దానికి అచంచలమైన అంకితభావం, కఠోర శ్రమ, లక్ష్యంపై స్పష్టత తప్పనిసరి అని అన్నారు. గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి ఆశయాలను గుర్తు చేస్తూ, ప్రతి విద్యార్థి తన రంగంలో ఉత్తముడిగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి, ప్రతి ప్రయత్నాన్ని సంపూర్ణ నిబద్ధతతో కొనసాగించాలని సూచించారు.





**"పెద్ద కలలు కనండి.. ఇచ్చిన మాట నిలబెట్టుకోండి"**

అధ్యక్షోపన్యాసంలో ఎం. శ్రీభరత్ పట్టభద్రులకు విజయానికి దారి చూపే ఏడు సూత్రాలను వివరించారు. పెద్ద కలలు కనడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం, గొప్ప వ్యక్తులతో కలిసి ప్రయాణించడం, లక్ష్యాల పట్ల అంకితభావం కలిగి ఉండడం, నిరంతరం నేర్చుకుంటూ ఎదగడం, వినయాన్ని అలవరచుకోవడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం విజయానికి బలమైన పునాదులని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే నాయకులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

**విద్య--పరిశోధనల్లో గీతం ప్రస్థానం**

వార్షిక నివేదికను సమర్పించిన అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, విద్య, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో గీతం సాధించిన పురోగతిని వివరించారు. సమాజ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన, బాధ్యతాయుతమైన నాయకులను తీర్చిదిద్దడం విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచ స్థాయి విద్యతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా గీతం ముందుకు సాగుతోందన్నారు.

**ప్రతిజ్ఞతో ముగిసిన వేడుక**

పట్టభద్రులైన విద్యార్థులు నైతిక విలువలు, వృత్తి నైపుణ్యం, దేశాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

## చౌటకూర్ ట్రైబల్ లా కాలేజీ మంజూరుపై హర్షం

**మంత్రి దామోదర రాజనర్సింహకు గిరిజన నాయకుల ఘన సన్మానం**

**రూ.35.50 కోట్లతో లా కాలేజీ.. గిరిజన విద్యార్థులకు న్యాయ విద్యకు కొత్త దారి**



**అందోల్, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):** చౌటకూర్ మండల కేంద్రంలో రూ.35.50 కోట్ల వ్యయంతో ట్రైబల్ లా కాలేజీకి పరిపాలనా అనుమతి లభించడంతో గిరిజన వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో కళాశాల మంజూరు కావడం గిరిజన విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని గిరిజన నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లంబాడాల పోరాట సమితి నాయకులు ప్రకాష్ రాథోడ్, మహేష్ రాథోడ్, మేఘరాజ్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన ప్రతినిధులు సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మిఠాయిలు తినిపించి తమ ఆనందాన్ని పంచుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన విద్యార్థులకు న్యాయ విద్య అందుబాటులోకి రావడం ద్వారా న్యాయ రంగంలో వారు మరింతగా రాణించే అవకాశాలు పెరుగుతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు స్థానికంగానే నాణ్యమైన న్యాయ విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. దిశా కమిటీ సంగారెడ్డి జిల్లా సభ్యుడు ప్రకాష్ రాథోడ్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. ట్రైబల్ లా కాలేజీ ఏర్పాటు గిరిజన యువతకు న్యాయవాదులు, న్యాయ నిపుణులుగా ఎదగడానికి బలమైన పునాది వేస్తుందని చెప్పారు. ఈ కళాశాల మంజూరుకు కృషి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఎస్సీ--ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్, ఆందోల్ నియోజకవర్గ నాయకుడు మహేష్ రాథోడ్, మేఘరాజ్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, సర్పంచ్‌లు వినోద్, జైపాల్, సేనాపతి అశోక్, గోపాల్, రాజు, గణేష్ నాయక్, గిరిజన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో భాగస్వామ్యం, సాంస్కృతిక అనుబంధం భారత్-ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు మరితంగా బలపడుతుంది ల

**ఆస్ట్రేలియా విద్యా శాఖ సహయ మంత్రి జులైన్ హిల్**

**విజయవాడస్లగ్:** ఆస్ట్రేలియా విద్యా శాఖ సహాయ మంత్రి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు, విద్యా రంగంలో భాగస్వామ్యం, సాంస్కృతిక అనుబంధం మరితంగా బలపడుతుందని ఆస్ట్రేలియా విద్యా శాఖ సహయ మంత్రి జులైన్ హిల్ అన్నారు.

# పట్టణంలో 8వ వార్డులో మౌలిక వసతుల కోసం యంఐఎం ఆందోళన





సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు వెంటనే ఏర్పాటు చేయాలి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు

ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ సోనీ యిర్మీయా ఆరోపణ

**జహీరాబాద్, ఆగస్టు 01 (ప్రజా జ్యోతి న్యూస్)** జహీరాబాద్ పట్టణ మున్సిపల్ పరిధిలోని రాంనగర్ 8వ వార్డులో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ వార్డు కౌన్సిలర్ సోనీ యిర్మీయా ఆరోపించారు. అదే విధంగా కాలనీలో రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ ఛైర్మన్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి రాంనగర్ 8వ వార్డులో సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంతేకాకుండా యంఐఎం పార్టీ నాయకులు కూడా కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించి న్యాయం చేయాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

# లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం శూన్యం..!

ప్రహరీ గోడ నిర్మాణం లోపం.

బురదమయమైన పాఠశాల ఆవరణ -- బాధ్యులెవరు?



**కల్హే ర్. 1.ఆగస్టు.** ప్రజా జ్యోతి కోట్లాది రూపాయలు విద్యాభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. దీంతో ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో తరగతి గదులకు వెళ్లేందుకు విద్యార్థులు బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే దుస్థితి పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే సమయంలో నీటి పారుదల కోసం సరైన ప్రణాళిక రూపొందించకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని



గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, పాఠశాల ఆవరణను విద్యార్థులకు అనుకూలంగా మార్చాలని వారు కోరుతున్నారు.

## పోలీసుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం.. వట్‌పల్లి స్టేషన్ ముట్టడి



**అందోల్, ఆగస్టు 01, (ప్రజా జ్యోతి):** వట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడి అనుమానాస్పద మృతి కేసు పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలకు దారితీసింది. దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల బీరప్ప మృతి చెందిన ఘటనలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాన్ని చెట్టు నుంచి కిందకు దించారని ఆరోపిస్తూ గ్రామస్తులు వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఘటనాస్థలంలో ఆధారాలను భద్రపరచాల్సిన సమయంలో పోలీసులు తొందరపడి వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపించారు. దాబా యజమానుల పాత్రపైనా పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులతో గ్రామస్తుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా పరిస్థితి అదుపు తప్పింది. ఆందోళనకారుల్లో కొందరు స్టేషన్‌లోని ఫర్నిచర్, కిటికీల అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న సీఐ అనిల్ కుమార్ అదనపు బలగాలతో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బీరప్ప మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో వట్‌పల్లి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మాత్రమే మృతికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## లికల్హే ర్ మండలంలో మహారాజు వాగు ఉద్ధృతిపై పోలీసుల పరిశీలన

ఏ ఎస్. ఐ. నాసర్ బేగ్



**కల్హే ర్. 1.ఆగస్టు.** ప్రజా జ్యోతి కామారెడ్డి జిల్లా--సంగారెడ్డి జిల్లా సరిహద్దులోని కల్హే ర్ మండలం మహారాజు వాగు వంతెన వద్ద వాగులో పెరుగుతున్న నీటి ప్రవాహాన్ని పోలీసులు శనివారం పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వాగులో నీటి ఉద్ధృతి పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఇబ్బందా శాఖ అధికారి ఏఎస్ఐ నాసిర్ అలీ బేగ్ స్థానికంగా చేపలు పట్టే మత్స్యకారులకు, వాగు సమీపానికి వచ్చే ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా వాగులోకి దిగవద్దని హెచ్చరించారు. అలాగే మహారాజు వాగు వంతెనపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు నీటి మట్టాన్ని గమనిస్తూ అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. పరిస్థితిని పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలు అధికారుల సూచనలు పాటించి అప్రమత్తంగా ఉండాలని కోరారు.